మాట నెరవేర్చడంలో ఆయనే సాటి

వైఎస్సార్ ఆసరా పంపిణీ సభలో మంత్రి జోగి రమేష్



కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను అందజేస్తున్న మంత్రి జోగి రమేష్



నాగాయలంకలో చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

కృత్తివెన్ను: ఇచ్చిన మాట నెరవేర్చడంలో ఆయనకు అయనే సాటిగా మన ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా పేరుతో ప్రభుత్వం విడుదల చేసిన నిధుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం మండల పరిధిలోని చినగొల్లపాలెంలో నిర్వహించారు. మంత్రికి మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మన సీఎం జగనన్న పేదల సంక్షేమ పథకాలను ఉపేక్షించకుండా అమలు చేయడం ఆయన మంచి మనస్సుకు నిదర్శనమన్నారు. మూడో విడత వైఎస్సార్ ఆసరాలో భాగంగా మండలంలో రూ. 10.59 కోట్లు పైచిలుకు సొమ్మును మన డ్వాక్రా అక్క చెల్లెమ్మల ఖాతాలకు జమ చేశారని తెలిపారు. ఇదంతా జగనన్న పేదలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న తపనతోనే చేస్తున్నట్లు వివరించారు. తొలుత ముఖ్యమంత్రి చిత్రపటానికి మంత్రి క్షీరాభిషేకం చేశారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లతోపాటు, తాగునీరు, అనుసంధాన రోడ్లు మొదలైన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తున్నామని, త్వరలో మిగిలినవి కూడా చేస్తామని హామీ ఇచ్చారు. చినగొల్లపాలెంకు నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతో రెండు వంతెనల నిర్మాణం చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పోషకాహార స్టాల్స్‌ను పరిశీలించారు. సభావేదిక వద్ద డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మంత్రి తనయుడు వైఎస్సార్ సీపీ యువ నాయకులు జోగి రాజీవ్, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సర్పంచ్ సునీల్, ఎంపీడీవో పిచ్చిబాబు, ఏపీఎం ప్రసాద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పెదతుమ్మిడి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం పలు గ్రామాలకు చెందిన డ్వాక్రా సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా చెక్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి వి. చినబాబు అధ్యక్షతన వైఎస్సార్‌కాంతిపథం(వెలుగు) ఏసీ కనకరావు పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ. 20,15,10వేల స్కాలర్‌షిప్ అందజేస్తానని హామీ ఇచ్చాడు. తొలుత గౌరీదేవి కోలాటం బృందం చిన్నారులు కోలాట ప్రదర్శనతో మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పెదతుమ్మిడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ఐసీడీఎస్ అధికారులు మంత్రి చేతుల మీదుగా సీమంతం చేయించారు. అనంతరం పెదతుమ్మిడి, చినతుమ్మిడి, మల్లపరాజుగూడెం, పి. రావిగుంట, ఆముదాలపల్లి, రామవరపుమోడి గ్రామాలకు చెందిన 231 స్వయం శక్తి సంఘాల్లోని సభ్యులకు ఆసరా పథకంలో మంజూరైన రూ. 2,11,22,008 చెక్‌ను మంత్రి స్థానిక ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సభ్యులతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిన్నారిబాబు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ కె. గంగాధర్, పి. బాబూరావు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఎంపీటీసీ ఎం. రుక్మిణి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా నిధుల పంపిణీ

పెడన: మండలంలో చెన్నూరు సెక్టారు పరిధిలోని డ్వాక్ర గ్రూపు సభ్యులకు మూడో విడత ఆసరా నిధుల పంపిణీ కార్యక్రమాన్ని నందిగామలో ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.



ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ కవిత, సలార్‌దాదా

మహిళాభ్యున్నతికి పెద్ద పీట

నాగాయలంక(అవనిగడ్డ): మహిళాభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. స్థానిక ఏఎంసీ యార్డు ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని 1121 పొదుపు సంఘాలకు మూడవ విడత ఆసరా పథకం కింద రూ.9.62 కోట్లు నిధుల చెక్కును ఎమ్మెల్యే సింహాద్రి అందజేశారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ మూడు విడతలో నాగాయలంక మండలంలో మొత్తం రూ.28.88 కోట్లు 'ఆసరా' కింద మహిళా సంఘాలకు అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, యువనేత సింహాద్రి వికాస్, ఎంపీపీ భోగాది రాఘవరాణి, జడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, మండల పార్టీ కన్వీనర్ భోగాది శేషగిరి రావు, ఏపీ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిచిన్నారి తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: వైఎస్సార్ ఆసరాపై మంగళవారం కృత్తివెన్ను మండలం గరిశపూడి వద్ద బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మచిలీపట్నంలో

మచిలీపట్నంటౌన్: మహిళా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నగరంలోని పలు డివిజన్లలో డ్వాక్రా మహిళలకు మూడో విడత మంజూరైన నిధుల చెక్కులను ఆయన సోమవారం పంపిణీ చేశారు. నగరంలోని 13 డివిజన్ల మహిళలకు నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సభల్లో పాల్గొని ఈ మొత్తాలను అందజేశారు. రూ. 25.27 కోట్ల నగదు చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మెప్మా సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాధి' సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న ఎంపీపీ మధుసూదనరావు

గూడూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి 2021–22 ఆర్థిక సంవత్సరంలో గూడూరు మండలంలో నిర్వహించిన పనులకు సోమవారం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక జరిగింది. ఎంపీపీ మధుసూదనరావు అధ్యక్షతన జెడ్పీటీసీ సభ్యుడు ఎసురేష్ రంగబాబు, ఎంపీడీఓ డి.సుబ్బారావు, ప్రిసైడింగ్ అధికారి ఎం.వి.రమణయ్య, జిల్లా విజిలెన్స్ అధికారిణి వి.విజయలక్ష్మి, స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రయ్య సమక్షంలో ప్రజావేదిక నిర్వహించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం పంచాయతీరాజ్, సర్వశిక్షా అభియాన్, ఫారెస్ట్ విభాగంలో మొత్తం 610 పనులు చేపట్టారు. రూ.10,27,78,334 పనులు జరిగాయి. వీటిపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో నిబంధనలకు అనుగుణంగా జరగని పనికి సంబంధించి రూ.5358 రికవరీ, జరిమానా రూ.3800 విధించారు.

ఎమ్మెల్యే సింహాద్రిని విమర్శించే స్థాయి టీడీపీకి లేదు

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య

అవనిగడ్డ: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి కష్టాలను తెలుసుకుంటూ సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుని విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ చింతలమడ రోడ్డు ప్రమాద మృతులకు పరిహారం అందించేందుకు ఎమ్మెల్యే సింహాద్రి ఎంతగానో కృషి చేశారన్నారు. దీనిపై ఒక ప్రకటన వెలువడే సమయంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ దీక్షలంటూ హడావుడి చేసి రాజకీయ పబ్బం గడిపారని చెప్పారు. ప్రాణాలకు తెగించి ఎమ్మెల్యే కరోనా భాధిత కుటుంబాలకు బాసటగా నిలిచి ధైర్యం చెప్పారన్నారు. మా ఎమ్మెల్యేని విమర్శించే ముందు మీ నాయకుడి పనితీరు గ్రహించి మాట్లాడాలని టీడీపీ నేతలకు హితవు పలికారు. సమావేశంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు మద్దాల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు మేలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

కోనేరుసెంటర్: ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు మేలు చేకూరుతుందని కోన గ్రామం సర్పంచ్ నాగేశ్వరమ్మ అన్నారు. బందరు మండలం కోన గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాగేశ్వరమ్మ మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలంలో 32 రకాల నవధాన్యాలు వేయడంతో జీవవైవిధ్యం, సూక్ష్మజీవులు, అధికపోషకాలు పెరుగుతాయన్నారు. వెలుగు సీసీ జ్యోతిర్మయి మాట్లాడుతూ విత్తన రక్షణకు విత్తన గుళికలు చేయడంతో మొలక శాతం పెరుగుతుందన్నారు. తేమ, ఎండ శాతం తట్టుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో రైతుభరోసాకేంద్రం సిబ్బంది దీపిక, సుమ, స్వామిబాబు, ఝాన్సీ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ ద్వారా రైతులకు సేవ



పీఏసీఎస్‌లో మాట్లాడుతున్న సభ్యులు

కొత్తమాజేరు (చల్లపల్లి): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రైతులకు సేవ చేస్తున్నట్లు మాజేరు పీఏసీఎస్ చైర్మన్ అరజా శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక పీఏసీఎస్‌లో మహాజన సభ నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రీజనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అనునిత్యం అండగా ఉంటూ అందిస్తున్న ప్రోత్సాహంతో నూతన పీఏసీఎస్ భవనం నిర్మించి, లాకర్ సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రైతాంగ సంక్షేమానికి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ పర్సన్లు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లె కోటేశ్వరరావు, సీఈఓ ఎస్.ఎస్. చక్రపాణి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో అప్రమత్తం చేస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

మోపిదేవి: జాతీయ రహదారిపై సోమవారం మోపిదేవిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా వెంటనే 108కు సమాచారం అందించి అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మచిలీపట్నం నుంచి అవనిగడ్డ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న నాగిశెట్టి రామకోటేశ్వరావు, ఆదిలక్ష్మి మోపిదేవి నుంచి చల్లపల్లి వైపు వెళుతున్న నెరుసు పద్మ, కుమారుడు శ్రీనివాసరావు ద్వి చక్ర వాహనాన్ని ఢీ కొన్నారు. దీంతో ఆ నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనలతో రామకోటేశ్వరావును మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిసింది. డీఎస్పీ వెంటనే స్పందించడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

మేకావారిపాలెంలో రాములోరి పట్టాభిషేకం

పాగోలు (చల్లపల్లి): పాగోలు పంచాయతీ పరిధిలోని మేకావారిపాలెంలో రామాలయం నిర్మించి పుష్కర కాలం పూర్తైన సందర్భంగా సోమవారం రాముల వారికి అంగరంగ వైభవంగా పట్టాభిషేకం నిర్వహించారు. వాస్తు పూజ, ఆయుష్య హోమం, శ్రీరామ పట్టాభిషేకం, గర్భాలయంలో స్వామివారికి విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. నిర్విరామ రామనామ స్మరణ, కోలాట ప్రదర్శన చేశారు. రామనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆంజనేయుడి స్తోత్రాలు పఠించారు. శ్రీరామరామ రామేతి రమేరామే మనోరమే అంటూ భక్తజనం పులకించారు. అంతటా రామనామమయంగా మారింది. ఆ ప్రాంతంలో ఆధ్యాత్మిక వీచికలు వీచాయి.

406 గ్రూపులకు రూ.2.87కోట్లు



అధికారులతో సమీక్షిస్తున్న పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ రాణి

పెడన: పట్టణంలోని 406 గ్రూపులకు మూడో విడత ఆసరా కింద రూ.2.87కోట్లు విడుదలయ్యాయని, ఈ పంపిణీ కార్యక్రమాలు ఏప్రిల్ 2, 5వ తేదీలలో పట్టణంలో జరుగుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జోత్స్నరాణి అన్నారు. సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ చైర్‌పర్సన్ తన చాంబరులో మెప్మా అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లుతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 2వ తేదీన పైడమ్మ ఆలయం వద్ద మధ్యాహ్నం, 5వ తేదీన మార్కెట్ యార్డులో మధ్యాహ్నం 'ఆసరా' పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు.

సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లంకమ్మ హుండీ ఆదాయం రూ.4.45 లక్షలు

అవనిగడ్డ: శ్రీలంకమ్మ ఆలయంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఐదు నెలలకు హుండీ ఆదాయాన్ని లెక్కించగా, 4,45,908 వచ్చినట్టు ఈవో సీతారామయ్య చెప్పారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి కె. శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా చల్లపల్లి గ్రూపు దేవస్థానాల ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

గుడివాడటౌన్: రవాణా శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన వాహనాల బహిరంగ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.3,36,700 ఆదాయంతో పాటు జీఎస్టీ రూపంలో రూ.63,900 ఆదాయం చేకూరినట్లు ఆర్టీఓ విజయసారధి సోమవారం తెలిపారు. స్థానిక డ్రైవింగ్ ట్రాక్ వద్ద వివిధ కారణాలతో సీజ్ చేసిన వాహనాలకు బహిరంగవేలం జరిపినట్లు ఆయన తెలిపారు. మొత్తం 23 వాహనాలను వేలం వేయగా మొత్తం రూ.4,00,600 ఆదాయం వచ్చింది.

చిన్నమొత్తాల పొదుపుతో ప్రయోజనం

పోస్టల్‌శాఖ ఏడీ నరసింహారావు



పోస్టల్ యాప్ ప్రతిని చూపుతున్న తపాలా అధికారులు

అవనిగడ్డ: పోస్టాఫీస్ ద్వారా అందిస్తున్న పీఎల్ఐ, చిన్న మొత్తాల పొదుపుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వీఎస్ఎల్ నరసింహారావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక హెడ్ పోస్టాఫీస్‌ని సందర్శించి పోస్టల్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పోస్టాఫీస్ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. 2016కు ముందు ఆధార్ తీయించుకున్న వారు తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగరాజు, హెడ్ పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ సాయిప్రియతమ్, రిక్రేషియన్ క్లబ్ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రుస్తుంబాదలో శ్రీ భద్రాద్రి శ్రీరాముల వారి దేవాలయంలో సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 2వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయి. 30వ తేదీ గురువారం 10 గంటలకు కల్యాణం, 31వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆస్థానోత్సవం, శ్రీ స్వామివారిని పెండ్లి కుమారునిగా, అమ్మవారిని పెళ్లికుమార్తెగా చేశారు. ఘంటసాల శ్రీనివాసకుమార్, వెంకటసుధాకర్ దంపతులు పీటలపై కూర్చున్నారు. వరదా శరత్‌కుమార్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అనుమకొండ శ్రీధర్, సభ్యులు, కార్యనిర్వహణాధికారి గోవాడ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 39వ డివిజన్‌లో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కచ్చా డ్రెయిన్లలో పూడికతీత పనులు చేశారు. డ్రెయిన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. రోడ్లను ఊడ్చి సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించారు. పనులను కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, డివిజన్ కన్వీనర్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

జేసీ ఔదార్యం



చిలకలపూడి(మచిలీపట్నం): దివ్యాంగుని స్వయం ఉపాధికి మంజూరైన చెక్కును అందజేయటంలో జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ ఔదార్యం చూపించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా నేషనల్ హ్యాండీక్యాప్డ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.5 లక్షల రుణానికి సంబంధించిన చెక్కును జాయింట్ కలెక్టర్.. దివ్యాంగ లబ్ధిదారుడు అబ్దుల్‌రహీమ్‌కు అందజేశారు. ఆ సమయంలో జేసీ స్పందన వేదికను వదిలి వికలాంగుని వద్దకు వచ్చి స్వయంగా చెక్కును అందజేయడంలో ఔదార్యం చూపారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, వికలాంగ సంక్షేమశాఖ ఏడీ రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వర్ణోత్సవ సంగీత సభలు



మచిలీపట్నంటౌన్: త్యాగరాజ సంగీత విద్యాపీఠం స్వర్ణోత్సవ సంగీత సభలు సోమవారం ముగిశాయి. ఈ నెల 22న ప్రారంభమైన సభల్లో ప్రముఖ సంగీత కళాకారులు గాత్రకచేరీలు చేశారు. సోమవారం ప్రముఖ గాయకుడు జీవీ ప్రభాకర్ ఆలపించిన గాత్రం సభికులకు వీనుల విందు చేసింది. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ఎ-గ్రేడ్ కళాకారుడిగా, సంగీత స్వరకర్తగా పని చేస్తున్న ప్రభాకర్ ఎంతో మంది సంగీత అభిమానులను తన సంగీతంతో ఓలలాడిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. తొలుత క్లారినెట్ ఎ-గ్రేడ్ కళాకారుడు తరకటూరు వీరాంజనేయులు వాయిద్యం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని విద్యాపీఠం అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సింగరాజు గోవర్ధన్, కార్యదర్శి కల్యాణి, నిర్వాహక కార్యదర్శి కాశీపట్నపు ఉమ, కోశాధికారి జొన్నలగడ్డ లక్ష్మీకాంత్ పర్యవేక్షించారు.

బస్సులపై పోస్టర్లతో అవగాహన



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఆర్టీసీ డిపోలోని పల్లెవెలుగు బస్సులపై లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం నేరమని తెలిపే వాల్ పోస్టర్లను సోమవారం అంటించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాబాయి పర్యవేక్షణలో లింగనిర్ధారణ చట్టంపై పోస్టర్లను రూపొందించారు. ల్యాబ్‌లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం నేరమని ఒక వేళ చేస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ రూపొందించారు. పోస్టర్లను డిపో మేనేజర్ టి.పెద్దిరాజు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జేమ్స్, కార్యాలయ పర్యవేక్షకుడు కె. కుమార్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శివసాంబిరెడ్డి, విస్తరణాధికారి బి.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మేళ్లమర్తిలంక(మోపిదేవి): మేళ్లమర్తిలంక పీఏసీఎస్ సొసైటీ సభ్యులు రెడ్రౌతు రామారావు(79) ఇటీవల మరణించారు. మృతుని భార్య కస్తూరిబాయికి పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెంకట రమణ సోమవారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఉత్తరచిరువోలులంక సర్పంచ్ చింతా శ్రీనివాసరావు, రెడ్రౌతు రాంప్రసాద్, రామమోహనరావు, వేణు సొసైటీ కార్యదర్శి అల్లంశెట్టి ఏసయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మచిలీపట్నంటౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లు డీఎస్‌వో పార్వతి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)కి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని వైఎస్సార్ మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ నిర్వాహకుల సంఘం రాష్ట్ర నాయకుడు పిన్ని శ్యామ్‌బాబు, నాయకులు అందజేశారు.

రంగస్థల కళాకారుల సంక్షేమానికి కృషి

మచిలీపట్నంటౌన్: రంగస్థల కళాకారుల సంక్షేమానికి ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)తో పాటు తాను కృషి చేస్తామని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ గూడవల్లి నాగరాజు అన్నారు. నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో రంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో మచిలీపట్నం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. నాగరాజు మాట్లాడుతూ 20 ఏళ్లుగా రంగస్థల కళాకారులు ప్రజలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, వినోదాన్ని అందించడానికి కృషి చేస్తున్నారన్నారు. వారి సంఘ వార్షికోత్సవ కార్యక్రమాలు ఏటా నిర్వహిస్తున్నారని ఈ ఏడాది ఏప్రిల్ 15, 16 తేదీల్లో ప్రధాన పార్కులోని కళావేదికపై నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు ఎమ్మెల్యే పేర్ని నాని రూ. 10,116 వారి సంఘానికి విరాళంగా అందజేశారన్నారు. కళాకారుల సంక్షేమానికి ఎమ్మెల్యే పేర్ని నానితో పాటు తాను 2వ వార్డు కార్పొరేటర్ పరింకాయల విజయ్ కృషి చేస్తామన్నారు. కళాకారుల సంఘానికి తనను గౌరవ సలహాదారుగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాహిత్యం, కళలు వ్యక్తిత్వ వికాసానికి ప్రతీక



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

చిలకలపూడి(మచిలీపట్నం): సాహిత్యం, కళలు వ్యక్తిత్వ వికాసానికి, ప్రజాచైతన్యానికి ప్రతీకలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. కూడూరు గ్రామంలో ఆమె నివాసం వద్ద బహుజన సాహిత్య అకాడమీ కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఆమె ఆవిష్కరించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు సేవలు అందిస్తున్న వ్యక్తులకు గుర్తింపుగా ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బహుజన సాహిత్య అకాడమీ సంస్థ కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో అకాడమీ ప్రతినిధులు జంపాన శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నందమూరులో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో భక్తులు

పెడన: నందమూరులో శ్రీసీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. విగ్రహ ప్రతిష్టను కట్టా పోతురాజు స్వామి, వెంకటేశ్వరమ్మ దంపతులతో వేదపండితులు చేయించారు. మంత్రి జోగి రమేష్ స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది.

కొట్లాటపై కేసు

కోనేరుసెంటర్: చిన్నపాటి వివాదం కొట్లాటకు దారి తీసింది. ఘటనలో ఓ యువకుడు గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదుతో చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. మచిలీపట్నం రాజుపేటకు చెందిన చండిక నాగమణివర్ధన్ ఆదివారం రాత్రి నిజాంపేటలో స్నేహితులను కలిసేందుకు వెళ్లాడు. నిర్మానుష్య ప్రదేశంలో మూత్రవిసర్జన చేస్తుండగా ఆ ప్రాంతానికి చెందిన ఆవుల దుర్గాప్రసాద్ మా ఏరియాలోకి వచ్చి విసర్జన చేస్తావా అంటూ ఘర్షణ పడ్డాడు. ఈ విషయంలో ఇద్దరూ కలబడ్డారు. దీంతో దుర్గాప్రసాద్ తన స్నేహితులు హరీష్, సాయిరామ్, కుళ్లలకు ఫోన్ చేసి పిలిచాడు. అక్కడికి చేరుకున్న స్నేహితులు, దుర్గాప్రసాద్ కలిసి మణివర్ధన్‌పై రాళ్లతో దాడి చేశారు. ఘర్షణలో మణివర్ధన్ గాయపడ్డాడు దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకటన

[illegible]